## క్లుప్తంగా

### ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం వస్తున్నారని సమస్యలుంటే పరిష్కారం కోసం విన్నవించుకోవాలని అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రతినిధి బంగారుసాయిలు గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్, అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు.

### రాష్ట్రస్థాయికి అండర్–19 ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: స్కూల్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో ఫుట్‌బాల్ జట్టుకు డీఐఈవో రవి ఆధ్వర్యంలో పీడీ ప్రసాద్ సమక్షంలో గురువారం ఎంపికలు నిర్వహించారు. నగరంలోని రాజారాం స్టేడియంలో బాలుర జట్టుకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

### రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు..



నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరానికి ముగింపు కార్యక్రమం నిర్వహించి తుది జట్టును గురువారం రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మానస గణేష్, కార్యదర్శి శ్యామ్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కామారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. సంఘం సభ్యులు కృష్ణమూర్తి కార్తీక్, అనిల్, శామిందర్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి యోగా పోటీలకు..

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల పోటీలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులోని ముదిరాజ్ భవన్‌లో ఈనెల 4,5 తేదీలలో జరగనున్నాయి. జిల్లా నుంచి 23 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొననున్నారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో తనయ నాలె, తన్వి నాలే, ఎం పవిత్ర, కే శృతి, ఎం వర్షిత, బి. సహస్రలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో సజన్ కుమార్, లక్ష్మీనారాయణ, వర్షిత్, కార్తీక్, ఓంకార్, సాయినాథ్, మణివర్ధన్‌లు ఎంపికయ్యారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో ఆసిత, నిర్ణయ, గీతిక, హాసిని, త్రివేణి, లక్ష్యస్విలు ఎంపికయ్యారు. జూనియర్ బాలురు విభాగంలో విశాల్, తరుణ్, కపిల్, తేజస్‌లు ఎంపికయ్యారు.

### పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

నిజామాబాద్‌నాగారం: పారిశుధ్య సిబ్బందికి సహాయ సహకారాలు అందించి స్వచ్ఛభారత్ నిర్మాణంలో మన వంతు సహకారాన్ని అందించాలని జిల్లా యోజన అధికారి బెల్లాల్ శైలి కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గాజుల్‌పేట్ ఖిల్లా ప్రాంత మున్సిపల్ కర్మచారులను జిల్లా యోజన అధికారిని శైలి బెల్లాల్ అభినందించారు. ఈ రెండు ప్రాంతాలలోని ఉత్తమ సేవలను అందించిన పారిశుధ్య కార్మికులను గుర్తించి సానిటరీ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో సుజాత, మాధవి, మల్లేశం, సాయిలు లక్ష్మణ్, సంజీవ్‌లను సన్మానించి ప్రశంసించారు.

### సమస్యలపై దృష్టి సారించాలి

నిజామాబాద్ సిటీ: పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి నగరానికి వస్తున్న మహేష్ గౌడ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఆకుల పాపయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని సహకార చక్కెర కర్మాగారాలు తెరిపించాలని, తెలంగాణ వర్సిటీ భూములు కబ్జాకాకుండా కాపాడాలని కోరారు. నాయకులు వేల్పూర్ భూమయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ సేవకు పురస్కారం

ఖలీల్‌వాడి: జాతీయ లోక్‌అదాలత్‌లో ఉత్తమ సేవలకు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌జీ రవికి జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల గురువారం సర్టిఫికెట్ అందజేశారు. కోర్టుల్లో కక్షిదారులకు ఎల్లప్పుడు సేవలందించాలని ఆమె పేర్కొన్నారు. హెచ్‌జీ రవి జాతీయ లోక్‌అదాలత్‌లో సేవలందించారు.

### కల్లుగీత సంఘం వార్షికోత్సవ సభలకు తరలిరావాలి

నిజామాబాద్ సిటీ: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవాలు ఈనెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారని వాటిని విజయవంతం చేయాలని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో నాయకులు పెద్ది వెంకట్రాములు, నర్సింలుగౌడ్, శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్‌లు సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

# కొలువుదీరిన దుర్గమ్మ

- దేవీశరన్నవరాత్రులు ప్రారంభం
- మాలలు ధరించిన భవానీ భక్తులు

దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలో గురువారం దుర్గామాత విగ్రహాలు కొలువుదీరాయి. విగ్రహాలను ఊరేగింపుగా మండపాలకు నిర్వాహకులు తరలించారు. అమ్మవారి ఊరేగింపు చూడడానికి భక్తులు బారులు తీరారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



దేవిమాత గుడిలో భక్తుల సందడి





మార్కండేయ మందిరం నుంచి మండపాలకు విగ్రహాలను తరలిస్తున్న భక్తులు.. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో..



గాయత్రినగర్‌లో..



సిరికొండలో..



డిచ్‌పల్లిలో..



లలితా దేవి ఆశ్రమంలో..

# అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు

- మున్సిపల్ జనరల్ ఫండ్‌తో అభివృద్ధి పనులు చేస్తున్నాం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

నిజామాబాద్ సిటీ: తెలంగాణ సర్కారు నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని, ఎన్నిసార్లు సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించినా ఫలితం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నగరంలోని పలు డివిజన్‌లలో జరిగిన అభివృద్ధి పనులకు నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి భూమిపూజ చేశారు. కార్పొరేషన్‌లోని 20, 16 డివిజన్లలో స్థానిక కార్పొరేటర్‌లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళికలతో కలిసి పర్యటించారు. 20వ డివిజన్‌లో రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్డ్ పనులు, 16వ డివిజన్‌లో కంఠేశ్వర్ బ్యాంక్‌కాలనీలో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు నగర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ఇబ్బందులు పెడుతోందని వాపోయారు. చివరకు మున్సిపల్‌లోని జనరల్ ఫండ్ నుంచి కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్ర సర్కారు వివక్ష కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా ఆగిపోయాయన్నారు. నగర అభివృద్ధికి స్పెషల్ ఫండ్ కింద రూ.100 కోట్లు మంజూరు చేయాలని గతంలో సీఎం రేవంత్‌కు, మంత్రి జూపల్లికి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్లు, సిబ్బంది, బీజేపీ కార్యకర్తలు గంగామణి, ఓంప్రకాష్, విజయ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీకి సంబంధించిన 50 ఎకరాల భూమిని కాపాడాలని, కబ్జా చేస్తున్న వారితో పాటు సహకరిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెయూ మెయిన్ గేట్ ముందు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ..హైడ్రా పేరుతో ప్రభుత్వ భూములను ఎలా అయితే స్వాధీనపరుచుకుంటున్నారో అలాగే యూనివర్సిటీకి చెందిన ప్రభుత్వ భూమిని కూడా కాపాడాలని కోరారు. నాయకులు ప్రిన్స్, రవీందర్, శివసాయి, వంశీ, రాకేశ్, స్రవంతి, రచన, గౌతమి, ప్రియ, రమ్య పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు

రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. గురువారం ప్రధాన కూడళ్ల వద్ద రంగురంగుల బతుకమ్మలను ఉంచి మహిళలు ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.



తెయూలో బతుకమ్మలతో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు



బతుకమ్మలతో నగర మేయర్ దండు నీతూకిరణ్

### డీజే నిర్వాహకులకు లైసెన్సు తప్పనిసరి



సిరికొండ: డీజే నిర్వాహకులు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులతో ఎస్సై గురువారం సమావేశం నిర్వహించారు. లైసెన్సు లేని డీజేలను సీజ్ చేస్తామని ఎస్సై తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



# నెంబర్ వన్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఏఎంసీ అధికారులు

సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల తన ఛాంబర్‌లో మహాలక్ష్మీ, దుర్గామాత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శుభదినం కావడంతో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 7న మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీలు, రైతుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ, సూపరింటెండెంట్ లాబన్, సూపర్‌వైజర్లు సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఇంద్రుడు, దేవకరుణ, గ్యానాజి గంగారెడ్డి, యెన్నం బాగారెడ్డి, రాజలింగం, రాజన్న, మంగ్యా, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని డీ–9 సుభాష్‌నగర్ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ తోట రాజశేఖర్ గురువారం తెలిపారు. 11కేవీ విద్యుత్‌నగర్ ఫీడర్, 11కేవీ కంఠేశ్వర్ ఫీడర్, 11కేవీ హమాల్‌వాడీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



సుభాష్‌నగర్: సార్వజనిక్ సమితి ఆధ్వర్యంలో గురువారం దేవినవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షులు హరిదాసు, కమిటీ అధ్యక్షుడు అంబెం సాయి లు, వెంకటయ్య, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



నిజామాబాద్‌అర్బన్ : నెహ్రూ యువ కేంద్రం, సీబీసీ ఆధ్వర్యంలో కాకతీయ కళాశాలలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మ నాయక్, కాకతీయ కళాశాల ప్రిన్సిపల్ రణవీర్, సీబీసీ ఎఫ్ పీఏ రషీద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### దడువాయిల సంక్షేమానికి కృషి


- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీక్ ఖాన్



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: రాష్ట్రంలో దడువాయి కార్మికుల సంక్షేమానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీక్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులోని దడువాయి యూనియన్ కార్యాలయంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రఫీక్ ఖాన్ మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సన్మాన సభకు మార్కెట్‌యార్డు నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడిగా ఎన్ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆర్ రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా డి ప్రవీణ్, కోశాధికారిగా ఎస్ ఉమేష్, కార్యవర్గసభ్యులతో గౌరవ సలహాదారులు, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు మల్యాల గోవర్ధన్, అశోక్ ప్రమాణం చేయించారు. హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న అబ్దుల్ ఖలీమ్‌పై మాదన్నపేట్ పోలీసులు విచక్షణ రహితంగా దాడి చేసినందుకు నిరసనగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. కోర్టు వద్ద సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. చట్టప్రకారం విధులు నిర్వహించాల్సిన పోలీసులు చట్టానికి విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డారు. పోలీసుల తీరుకు నిరసనగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు కోర్టు విధులకు హాజరుకాకుండా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టు ఎదుట మాదన్నపేట్ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు.

# నగరంలో సర్వే షురూ

- పైలట్ ప్రాజెక్టుగా 3, 38, 45 డివిజన్లలో సర్వే
- పరిశీలించిన కమిషనర్, మేయర్



గూగూల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: రాష్ట ప్రభుత్వం తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తోంది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం మూడు డివిజన్లలో ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టు కింద చేస్తున్న సర్వేలో నగరంలో 3, 38, 45 డివిజన్లను ఎంచుకున్నారు. ఈ సర్వేను మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, అదనపు కమిషనర్ శంకర్‌లు రెండు బృందాలుగా సర్వేను పరిశీలిస్తున్నారు. నగర మేయర్ దండు నీతు కిరణ్, కమిషనర్ మకరందు దుబ్బలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈనెల 8 వరకు పూర్తి చేసి వివరాలు 9న రిపోర్టు చేయాలని ఆదేశించారు.









# తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన కుటుంబ సభ్యుల వివరాల సేకరణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డిచ్పల్లి మండలం సాంపల్లిలో గురువారం ప్రారంభించిన డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పలు సూచనలు చేశారు. నిర్ణీత సమయంలోపు పైలెట్ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా నూటికి నూరు శాతం డిజిటల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే కోసం సాంపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి డిజిటల్ సర్వే ప్రక్రియ జరిపిస్తున్నామని కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్ అంకిత్, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, డీటీ శ్రీకాంత్, ఆర్ఐ సంతోష్, తదితరులున్నారు.

### ఫొటోకు అనుమతి తీసుకోవాలి



గూపన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ సంకేత్, తహసీల్దార్

నిజామాబాద్ రూరల్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ట్రెయినీ కలెక్టర్ సంకేత్ అన్నారు. గురువారం గూపన్‌పల్లిలో తహసీల్దార్ అనిరుధ్, ఆర్ఐ హరీష్ ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, సిబ్బంది చేస్తున్న సర్వేను ట్రెయినీ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 7 వరకు సర్వే చేపట్టాలన్నారు. సర్వేలో భాగంగా ఫ్యామిలీ ఫొటోను కూడా వారి అనుమతితో తీసుకోవాలన్నారు. ఆ కుటుంబంలో మృతి చెందినవారు ఉంటే తక్షణమే ఆ పేరును తొలగించాలని అధికారులకు ఆదేశించారు.

### వన్యప్రాణి వారోత్సవాలు

ఇందల్వాయి: ఇందల్వాయి అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో 70వ వన్య ప్రాణి వారోత్సవాలను ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ గురువారం ప్రారంభించారు. వన్య ప్రాణుల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వారోత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

### డీఎస్‌వోను సన్మానించిన డీలర్లు



సుభాష్‌నగర్ : డీఎస్‌వో అరవింద్‌రెడ్డిని జిల్లా పెట్రోల్ పంప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు గురువారం కలెక్టరేట్‌లో సన్మానించారు. అసోసియేషన్ ప్రతినిధులు, డీలర్లు మంచాల జ్ఞానేందర్, వినోద్‌రెడ్డి, వెంకట నర్సాగౌడ్, ప్రతాప్ గుప్త, శ్రీనివాస్ పాల్గొన్నారు.

